చాళుక్య యుగము

వేంగి చాళుక్య రాజ్యస్థాపనతో ఆంధ్రుల చరిత్రలో నూతనాధ్యాయం ప్రారంభమయింది చాళుక్యులు కర్ణాటకంలోని బాదామినుండి బయలుదేరి విజేతలై ఆంధ్రదేశాన్ని ఆక్రమించి సుమారు ఐదు శతాబ్దాలకాలం పాలించినారు. బాదామి చాళుక్య శాఖ అయినందున వేంగి చాళుక్యులను ఆంధ్రేతరులుగా పరిగణించడం సహజం. అంతేగాక, వేంగి చాళుక్యులు తీరాంధ్రాన్ని మాత్రమే స్వాధీనం చేసుకొని పాలింపగలిగినారు; శాతవాహనులతో అంతరించిన ఆంధ్రదేశ రాజకీయ ఐక్యాన్ని సాధింపలేకపోయినారు. ప్రాగ్దక్షిణాంధ్ర భూములు (రాయలసీమ ప్రాంతం) వల్లవ రాజ్యంలో వారి సామంతులైన బాణ వైదుంబ ఎంశాల పాలనలో చిరకాలం ఉండి, అనంతరం చోళ సామ్రాజ్యాంతర్భాగాలయినాయి. తెలంగాణా ప్రాంతాలు పశ్చిమ చాళుక్య, రాష్ట్రకూట, కల్యాణి చాళుక్య వంశాలు వశపరచుకొన్నాయి. ఈ రాజవంశాలన్నీ వేంగి నాక్రమించి తద్వారా దక్షిణాపథపతిత్వాన్ని సాధించడానికై తరచు యుద్ధాలు చేస్తూ ఉండేవి. అందుచేత ఈ యుగంలో ఆంధ్రుల నిజ చరిత్ర ఏమి? అనే ప్రశ్న రావడానికి అవకాశం ఉంది వేంగిలో చాళుక్యులు స్థిరపడి స్థానికభావంతో ''జన్మభూమి శ్చాళుక్యానాం దేశో వేంగితిపత్రికృతః''అని చాటి, వేంగి ప్రజాక్షేమాన్ని కాంక్షించి పాలించినారు. చోళ చాళుక్యాది రాజవంశాలు సార్వభౌమత్వానికై పోటిపడి ఆంధ్రదేశాన్ని యుద్ధరంగంగా మార్చిన ఈ యుగంలో తూర్పు చాళుక్యులు ఆంధ్రదేశ స్వాతంత్ర్య గౌరవ ప్రతిష్టలను నిల్పడానికి శక్తికొలది ప్రయత్నించడమేగాక ఒక్కొక్కమారు ఆంధ్ర విజయపతాకాన్ని శత్రు భూములలో విహరింపజేసినారు. సాంస్కృతికంగా ఒక మహోద్యమాన్ని ప్రోత్సహించి చాళుక్యులు ఆంధ్రులకొక వ్యక్తిత్వాన్ని సమకూర్చినారు. నాటివరకు రాజస్థానాల్లో ఆదరణలేని తెలుగుభాషను ఆదరించి విశేష ప్రచారంలోనికి తెచ్చినారు. జాతీయాభివృద్ధికి, జాతి సమైక్యానికి భాషను మించిన సాధనం లేదు. అట్టి తెలుగు భాషను ఆంధ్రదేశంలో నిల్పి జాతీయ చైతన్యాన్ని కలిగించి; ఆంధ్రులు ఆంధ్ర దేశము, ఆంధ్రదేశాధీశ్వరుడు అనే భావాలు ఏర్పడడానికి సుగమమార్గం కల్పించినవారు చాళుక్యులు. అందుచేత తూర్పు చాళుక్యుల చరిత్రయే ఈ యుగంలో ఆంధ్రుల చరిత్ర అనడంలో సందేహానికి తావుండరాదు.